సాక్షి కర్నూలు
గురువారం । 21 । డిసెంబర్ । 2023



సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, జ్వాలా వీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు.



..ఎంతో ఉపయోగకరం

నాగలదిన్నె బ్రిడ్జి ఇరు తెలుగు రాష్ట్రాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం నాగలదిన్నె బ్రిడ్జిని ప్రారంభించారు. 8లో▶



అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి. చిత్రంలో కలెక్టర్ సృజన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తదితరులు

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- పత్తికొండలో నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష

పత్తికొండటౌన్: అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వ సమ ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం పత్తికొండలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత శివరామకృష్ణన్ కమిటీ అన్ని ప్రాంతాల అభివృద్ధికి పరిపాలనా వికేంద్రీకరణ అవసరం అని తెలిపిందన్నారు. అయితే టీడీపీ హయాంలో ఇంకో విధంగా పాలసీలను అమలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటిని సరిదిద్దాలని అనుకునే లోపే కరోనా వచ్చి భయంకర పరిస్థితులను ఎదుర్కోవడం జరిగిందన్నారు. అయినప్పటికీ గ్రామ స్థాయిలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి పాలనను ప్రజల దగ్గరికి చేర్చామన్నారు. నాడు–నేడు క్రింద విద్యా, వైద్యరంగాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనేక సంక్షేమపథకాలను అమలు చేశామన్నారు.ఒకేసారి లక్షకు పైగా నిరుద్యోగ యువతకు సచివాలయ ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు.

➤ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. లేఅవుట్‌లు లేని గ్రామాలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో 2,542 మంది అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించేందుకు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు హౌసింగ్ పీడీ తెలిపారు. ప్యాపిలి–పత్తికొండ రోడ్డు విస్తరణ, మద్దికెర–పత్తికొండ–దేవనకొండ రహదారి విస్తరణ, వెల్దుర్తి– ఈదుల దేవరబండ రోడ్డుతో పాటు పలు రోడ్ల అభివృద్ధి, విస్తరణ చేపట్టాలని మంత్రిని కోరారు. తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ త్వరలోనే తుగ్గలిని కరువుమండలంగా ప్రకటిస్తారన్నారు.

➤ జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు జలజీవన్ మిషన్‌కురూ. 530 కోట్లు కేటాయించారని, పెండింగ్‌లో ఉన్న టెండర్ పనులను కూడా త్వరితగతిన పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించిన జిల్లా కర్నూలు అన్నారు. ఈ సమీక్షల ద్వారా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలనుంచి వారి సమస్యలు తెలుసుకుని, సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధిపనులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పత్తికొండ ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జననేత.. అభివృద్ధి ప్రదాత

- జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్
- రూ.500 కోట్లతో కర్నూలు మెడికల్ కళాశాలకు కొత్త హంగులు
- రూ.450కోట్లతో ఆదోని నూతన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
- హంద్రీ–నీవా నుంచి 70 చెరువులకు నీరు
- సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాలోకి రూ.10వేల కోట్లు జమ
- నేడు సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు జిల్లా అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నాలుగున్నరేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధికి రూ. వేల కోట్లు మంజూరు చేశారు. సంక్షేమానికి అంతే స్థాయిలో నిధులు ఖర్చు చేశారు. ప్రగతికి బాటలు వేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచిన జననేత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు.



ఆదోనిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో ప్రగతి పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేల కోట్ల రూపాయాలను వెచ్చించారు. రాయలసీమకే తలమానికంగా ఉన్న కర్నూలు మెడికల్ కళాశాలకు కొత్త హంగులు తెచ్చేందుకు రూ.500 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. కరువుకు మారుపేరైన పశ్చిమ ప్రాంతం ఆదోనిలో రూ.450కోట్లతో నూతన మెడికల్ కళాశాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆంధ్ర – తెలంగాణలను కలిపే నాగులదిన్నె బ్రిడ్జిని నిర్మించేందుకు రూ.42కోట్లు మంజూరు చేశారు. 2009 వరదల సమయంలో ఈ వంతెన కూలిపోగా అప్పటి కాంగ్రెస్, గత టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గోరంట్ల బ్రిడ్జితో పాటు జిల్లాలోని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన అనేక వంతెనలు, రోడ్ల నిర్మాణానికి రూ.1,500 కోట్ల వరకు మంజూరు చేశారు. రూ.167కోట్లతో రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు, రూ.65.60కోట్లతో గ్రామ సచివాలయాలు, రూ.43.88కోట్లతో వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాలోకి నేరుగా రూ.10వేల కోట్లుకు పైగా జమ చేశారు. కరువు ప్రాంతమైన పత్తికొండ నియోజకవర్గంలో 70 చెరువులను హంద్రీ–నీవా నీటితో నింపారు. ఉమ్మడి జిల్లాలో విద్య రంగ పథకాలు, నాడు– నేడు కింద రూ.4,623కోట్లు ఖర్చు చేశారు. జలవనరుల శాఖ ప్రాజెక్టుల కోసం రూ.5,362.34 కోట్లు మంజూరు చేయగా వీటిలో 90 శాతం పనులకు నిధుల ఖర్చు చేశారు.

సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు పండుగా నిర్వహించేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. గురువారం జిల్లా వ్యాప్తంగా కేక్ కటింగ్‌లతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ, రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేత, పేదల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నుల అందజేసే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పార్టీ శ్రేణులు సామాజిక సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. నియోజకవర్గ కేంద్రాలతో పాటు ఊరువాడా కార్యక్రమాలు నిర్వహణకు పార్టీ నేతలు సూచనలు ఇచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న నేతగా పేరు పొందిన జననేత పుట్టిన రోజు వేడుకలను జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు.

నిర్వహించనున్న కార్యక్రమాలు ఇవీ..

›› కర్నూలులో మేయర్ బీవై రామయ్య క్యాంప్ కార్యాలయంలో ఉదయం 8గంటలకు కేక్ కటింగ్ ఉంటుంది. బిర్లాగేట్ వద్ద ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో 10 గంటలకు కేక్ కటింగ్, చెన్నమ్మ సర్కిల్‌లో 10. 30 గంటలకు పాణ్యం ఎమ్మెల్యే, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, కొండారెడ్డిబురుజు వద్ద పార్టీ మాజీ నగర అధ్యక్షుడు రాజా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, 3వేల మందికి అన్నదాన కార్యాక్రమం, కలర్ రైస్, చికెన్‌తో భోజనం ఏర్పాటు చేయనున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో 12 గంటలకు కేక్ కటింగ్, ప్రభుత్వం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ, అనాథ శరణాలయాల్లో దుస్తులు, నిత్యావసరాలు అందజేయనున్నారు.

›› కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో కోడుమూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సి. బెళగల్‌లో 500 మందితో మెగా రక్తదాన శిబిరం, వెయ్యి మందితో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు.

›› ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్‌కేడీ కార్యాలయంలో భారీ కేట్ కట్ చేసి, అన్నదాన, రోగులకు పండ్లు, బ్రెడ్డు అందించనున్నారు.

›› మంత్రాలయంలో ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్, పత్తికొండలోని గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ, ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, ఆలూరులో కార్మిక శాఖ మంత్రి తనయుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో పెద్ద ఎత్తున కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చెప్పిన దానికంటే మిన్నగా సంక్షేమ పథకాలు

కర్నూలు (అగ్రికల్చర్): ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన వాటిని చెప్పిన దాని కంటే మిన్నగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. కరోనా అల్లకల్లోలం చేసినా.. ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైనప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదు. ప్రజలు కష్టాల్లో ఉన్నారనే ఉద్దేశంతో క్యాలండర్ కంటే ముందుగానే అమలు చేయడం విశేషం. వైఎస్ఆర్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద 2019 ఎన్నికల సమయంలో ఏడాదికి రూ.12,500 ప్రకారం నాలుగేళ్ల ఇస్తామని ప్రకటించారు. అయితే ఈ మొత్తాన్ని రూ.13,500కు పెంచి ఐదేళ్లు అమలు చేయడం విశేషం. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ నేతన్న నేస్తం, అమ్మఒడి, వాహన మిత్ర, జగనన్న విద్యా దీవెన ఇలా అనేక సంక్షేమ పథకాలను దళారుల ప్రమేయం, రాజకీయ సిఫారసులు లేకుండా డీబీటీ ద్వారా అమలు చేశారు.

హామీల అమలు..

➡ ఈ ఏడాది జూన్ 1న పత్తికొండ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి పత్తికొండలో టమాట జ్యూస్ పరిశ్రమ హామీ ఇచ్చారు. ఇటీవలనే వర్చువల్‌గా టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన కూడా చేశారు. జనవరి చివరికి దీనిని అందుబాటులోకి తెచ్చే విధంగా కసరత్తు జరుగుతోంది.

➡ 2022 జూలై 5న ఆదోనిలో పర్యటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న హౌసింగ్ కాలనీకి మున్సిపాలిటీ నుంచి ధనాపురం వరకు బీటీ రోడ్డు వేసేందుకు హామీ ఇచ్చారు. ఇందుకు రూ.73 లక్షలు మంజూరు అయ్యాయి. ఆదోని మండలంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.60.50 కోట్లు మంజూరు చేశారు.

27న సీఎం జగన్ శ్రీశైలం పర్యటన?

శ్రీశైలంటెంపుల్: ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 27న శ్రీశైలం రానున్నట్లు సమాచారం. భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని, అనంతరం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అలాగే రూ.125 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్, శాలు మండపాలు, దేవస్థాన భూములకు బౌండరీ ఏర్పాటు, తాగునీటి ట్యాంకుల నిర్మాణం, దోర్నాల వద్ద షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండపం, నూతన వసతి సముదాయం తదితర పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. కాగా సీఎం జగన్ శ్రీశైలం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

కలెక్టర్‌ను కలసిన సబ్‌కలెక్టర్ శివనారాయణ్ శర్మ

కర్నూలు(సెంట్రల్): ఆదోని సబ్ కలెక్టర్‌గా నియమితులైన శివనారాయణ్ శర్మ కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం కలిశారు. పూల మొక్కను అందజేసి విధి నిర్వహణలో సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కాగా.. శివనారాయణ్ శర్మ 2021 బ్యాచ్‌కు చెందిన అఖిలభారత సర్వీసు అధికారి. శిక్షణ పూర్తి చేసుకొని ఆదోని సబ్ కలెక్టర్‌గా వచ్చారు. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అభిషేక్ కుమార్ శ్రీసత్యసాయిజిల్లా జేసీగా వెళ్లిన విషయం తెలిసిందే.



కలెక్టర్ సృజనకు పూలమొక్కను అందజేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ

క్లుప్తంగా

సుంకేసులను సందర్శించిన డీఎస్ఆర్పీ

కర్నూలు సిటీ: సుంకేసుల బ్యారేజ్‌ని డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ కమిటీ(డీఆర్పీ) బుధవారం సందర్శించింది. సాగునీటి ప్రాజెక్టులను సందర్శించి అవసరమైన చోట భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేసేందుకు ఈ కమిటీ ఈ నెల 22వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో పర్యటించనుంది. తొలిరోజు అయిన బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సుంకేసుల బ్యారేజీను సందర్శించి దాని నిర్మాణం, కరకట్టలు, గేట్లు తదితర అంశాలను కేసీ ఇంజినీర్లను అడిగి కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. వివరాలు నమోదు చేసుకుని భద్రతపై తీసుకోవాల్సిన పలు చర్యల గురించి ఇంజినీర్లకు సూచించారు. గురువారం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను, శుక్రవారం అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించనున్నారు. డీఆర్ఎస్పీలో ఛైర్మన్, కేంద్ర జల సంఘం మాజీ ఛైర్మన్ పాండ్యతో పాటు పలువురు సభ్యులు ఉన్నారు.

'ఆడుదాం-ఆంధ్ర'కు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు పక్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వర్చువల్‌గా ఆడుదాం-ఆంధ్ర క్రీడల నిర్వహణపై కలెక్టర్లు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డిసెంబర్ 26 నుంచి ఆడుదాం-ఆంధ్ర క్రీడలను ప్రారంభించాలన్నారు. క్రీడాకారులకు తప్పనిసరిగా తాగునీరు, భోజన వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల క్రీడా పరికరాలను అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కలెక్టరేట్ నుంచిజేసీ నారపురెడ్డి మౌర్య, డీఎస్డీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు(టౌన్): అథ్లెటిక్స్ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం విజేతలను అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు కొత్తపల్లి సుబ్బరత్నాలు, హర్షవర్ధన్ ప్రకటించారు.

పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలివ్వాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం నగర శివారులోని బి.తాండ్రపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తు

కర్నూలు సిటీ: జిల్లాలో రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు బ్రిడ్జి కోర్సుల్లో శిక్షణకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ బాలికల కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 2 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేది వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు.

టెలీకమ్యూనికేషన్‌లో జాతీయ భద్రత కాపాడాలి

కర్నూలు(రాజ్‌విహార్): టెలీకమ్యూనికేషన్‌లో జాతీయ భద్రత కాపాడాల్సిన అవసరం ఉందని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన పార్లమెంట్‌లో టెలికమ్యూనికేషన్స్ బిల్లు 2023పై ఆయన మాట్లాడారు. భారతీయ టెలిగ్రాఫ్ చట్టం 1885 ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రఫీ వంటి కాలం చెల్లిన చట్టాలను రద్దు చేయాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సభలో ప్రస్తావించారు.

తెలుగు రాష్ట్రాలకు ఎంతో ఉపయోగకరం

- నాగలదిన్నె బ్రిడ్జిని ప్రారంభించిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



నాగలదిన్నెలో హైలెవల్ వంతెనను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న జిల్లా జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చిత్రంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తదితరులు

నందవరం: ఇరు తెలుగు రాష్ట్రాలకు నాగలదిన్నె బ్రిడ్జి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం నందవరం మండలంలోని నాగలదిన్నె గ్రామ సమీపంలో తుంగభద్ర నదిపై నిర్మించిన బ్రిడ్జిని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైలెవల్ వంతెన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, జిల్లా జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల వెంకటరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రిబ్బన్ కట్ చేసి వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడుతూ.. 2009లో తుంగభద్ర నది ఉధృతిలో పాత బ్రిడ్జి కొట్టుకుపోయిందన్నారు. 2011లో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కొత్త బ్రిడ్జి నిర్మాణం మంజూరు చేయించారన్నారు. దాదాపు 10 ఏళ్ల పాటు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందన్నారు. కరోనా విపత్తు, తెలంగాణ వైపు భూ సేకరణ వంటి ఎన్నో అడ్డంకులు వచ్చినా ఆయన పట్టుబట్టి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించారన్నారు. అటు తెలంగాణ, ఇటు ఆంధ్ర ప్రజలకు బంధుత్వాలు ఉన్నాయని, వారందరికీ ఈ బ్రిడ్జి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాబోయే కాలానికి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారన్నారు.

– ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి మాట్లాడుతూ.. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి రూ.42 కోట్ల అంచనాతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేశామన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. గత తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదించి భూ సేకరణ సమస్యను పరిష్కరించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాంట్రాక్టరుకు బకాయిలు చెల్లించి వంతెన నిర్మాణానికి కావాల్సిన నిధులు సైతం మంజూరు చేసి పూర్తి చేయించిందన్నారు. బ్రిడ్జి ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ సృజన, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, నియోజకవర్గ నాయకులు బసిరెడ్డి, భీమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు నిఖిల్ చక్రవర్తి, గ్రామ సర్పంచ్ బోయ లక్ష్మీ, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఆదోని డివిజన్ ఈఈ కృష్ణారెడ్డి, డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు తిమ్మయ్య, తిమ్మారెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగలదిన్నె బ్రిడ్జిపై కొనసాగుతున్న రాకపోకలు

హజ్ యాత్రకు దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్ర-2024 కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీతో ఉన్న గడువును 2024 జనవరి 15వ తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మక్కాలో హజ్, మదీనా యాత్ర కోసం వెళ్లేందుకు ఆసక్తి ఉన్న ముస్లింలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుకు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీ, ఆధార్, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు-2, బ్యాంక్ అకౌంట్, కోవిడ్-19 సర్టిఫికెట్ కాపీలు జతచేయాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 94402 32564ను సంప్రదించాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన మొలగవెల్లి బాలరంగడు, అనురాధ కుమారుడు మొలగవెల్లి సాయి (19) బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొలగవెల్లి సాయి బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. చదువుల ఒత్తిడి తట్టుకోలేక బుధవారం కర్నూలులో పురుగుమందు తాగాడు. గమనించిన తోటి విద్యార్థులు చికిత్స కోసం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఓటరు జాబితా ఫిర్యాదులను పరిష్కరించండి

- అధికారులను ఆదేశించిన ఓటరు జాబితా పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్/టౌన్): ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను విచారించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా ఓటరు జాబితా పరిశీలకుడు, ఏపీఎంఎస్ఐడీసీ వైస్‌చైర్మన్, ఎండీ మురళీధర్‌రెడ్డి బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు సవరణ జాబితాకు సంబంధించి ఫారాలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా పత్తికొండ, ఆలూరు, కోడుమూరు, పాణ్యం, మంత్రాలయం నియోజకవర్గాలకు సంబంధించి ఫారాలను పరిశీలించి వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయా, లేదా, సంతకాలు తీసుకున్నారా, లేదా, ఒకవేళ ఓటరు మరణించి ఉంటే మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నారా, లేదా తదితర విషయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 5న తుది ఓటరు జాబితా సవరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎపిక్ కార్డుల ప్రింటింగ్‌ను వేగవంతం చేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు.అనంతరం ఆయన కర్నూలు నగరంలో పర్యటించి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సమావేశంలో కర్నూలు నగర పాలకసంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పోటాపోటీగా షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాట

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లకు బుధవారం వేలంపాట నిర్వహించారు. మార్కెట్ యార్డు స్థలంలో వెంకటరమణ కాలనీకి వెళ్లే రోడ్డుకు రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. గతంలో వేలంపాట ద్వారా షాపులు కేటాయించినప్పటికీ 11 షాపులను దక్కించుకున్న వారు తర్వాత రద్దు చేసుకున్నారు. వీటికి మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ పర్యవేక్షణలో వేలంపాట జరిగింది. 11 షాపులకు 32 మంది దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. 1వ నెంబరు షాపునకు రూ.23,600, షాపు నెంబరు2కు రూ.22,100, 3వ షాపునకు రూ.23,000, 4వ షాపునకు రూ.21,000, 5వ షాపునకు రూ.21,600, 8, 10 షాపులకు రూ.10,700, 9వ షాపునకు రూ.10,500, 11వ షాపునకు రూ.9,200, 13వ షాపునకు రూ.10,100, 15వ షాపునకు రూ.15,000 ప్రకారం అత్యధికంగా రేటు లభించింది. వేలంపాటను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు మార్కెటింగ్ శాఖ జేడీ తెలిపారు. పోటీ ఎక్కువగా ఉండటం వల్ల షాపులకు మంచి బాడుగలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. వేలంపాటలో ఏడీఎం నారాయణమూర్తి కూడా పాల్గొన్నారు.



వేలంపాటను పర్యవేక్షిస్తున్న జేడీ రామంజనేయులు, ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

ప్రతిభను వెలికితీసేందుకే కౌశల్ పోటీలు



విజేతలతో డీఈఓ రంగారెడ్డి తదితరులు

కర్నూలు సిటీ: విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే కౌశల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి తెలిపారు. భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సాంకేతిక మండలి సంయుక్తంగా బుధవారం రవీంద్ర గ్లోబెల్ స్కూల్‌లో కౌశల్ పోటీలు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల ఛైర్మన్ మోహన్ కుమార్, రవీంద్ర గ్లోబెల్ స్కూల్ సీఈఓ జి.వంశీధర్‌లు ప్రసంగించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయికి వెళ్లి ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. క్విజ్‌లో మొత్తం 36 పాఠశాలలు, పోస్టర్ ప్రజెంటేషన్‌కు జనరల్ విభాగంలో 72 మంది, భారతీయ శాస్త్ర సాంకేతిక రంగంలో శాస్త్రవేత్తల సేవలు విభాగంలో 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ ఎంఈఓ వినోద్‌కుమార్, రాష్ట్ర కౌశల్ అకడమిక్ కో-ఆర్డినేటర్ కుమార్ బాబు, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లోని విజేతలు వీరే..

1. గుడికల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు
2. వెల్దుర్తి కేజీబీవీవిద్యార్థులు
3. చెరుకులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ప్రజెంటేషన్ విజేతలు..:

థీమ్-1(పర్యావరణం కోసం జీవన విధానం)

1. పి.షాహిన్ బీ, జెడ్పీ హైస్కూల్, పెంచికలపాడు
2. పి.మహేష్, ఏపీ మోడల్ స్కూల్, ఆస్పరి
3. కె.ధరణీధర్, ఏపీ మోడల్ స్కూల్, పెద్దకడబూరు

థీమ్-2(విజ్ఞాన శాస్త్రం కోసం శాస్త్రవేత్తల కృషి)

1. ఎ.రేణుక, జెడ్పీ హైస్కూల్, చెరుకులపాడు
2. బి.బిందు, ఏపీ మోడల్ స్కూల్, పత్తికొండ
3. జె.ఉమాదేవి, జెడ్పీ హైస్కూల్, పర్ల

పేదల ఉన్నత చదువు కోసమే 'విదేశీ విద్యా దీవెన'

- కర్నూలు మేయర్ బీవైరామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని, డాక్టర్ సుధాకర్



విద్యార్థులకు మెగా చెక్కును అందజేస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జే.సుధాకర్, జేసీ మౌర్య తదితరులు

కర్నూలు(సెంట్రల్): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తున్నారని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జే.సుధాకర్ తెలిపారు. బుధవారం సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన, సివిల్స్ ప్రోత్సాహం పథకాల కింద ఎంపికైన అర్హులకు వారి ఖాతాల్లో నగదును ఆన్‌లైన్ ద్వారా బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మేయర్, ఎమ్మెల్యేలతోపాటు డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, గ్రంథాలయసంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, డీసీఎంఎస్ ఛైర్మన్ సీహెచ్ శిరోమణిమద్దయ్య, విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ...సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను బాగు చేయించారన్నారు. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌తోపాటు అమ్మఒడి, జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడం కోసం కూడా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించడం కోసం వారికి ఉచితకోచింగ్‌తో పాటు ప్రోత్సాహకాల కింద ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైతే ఒక్కో విద్యార్థి లక్ష రూపాయలు, మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఒక్కొక్కరికీ రూ.50 వేలు ఇస్తున్నారన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో ఒక్కొక్కరికీ రూ.1.25 కోట్లు, ఇతరులకు ఒక్కొక్కరికీ రూ.కోటి రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారన్నారు. దేశంలో ఇలాంటి పథకం ఏ రాష్ట్రంలో లేదన్నారు. అనంతరం జేసీ మౌర్య మాట్లాడుతూ.. జిల్లాలో విదేశీ విద్యా దీవెనకింద ఒకరు ఎంపిక కాగా, ఆ విద్యార్థికి రూ.6.40 లక్షలు అందించామన్నారు. సివిల్ సర్వీసెస్‌లో ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన ఒక్కొక్కరికీ లక్ష చొప్పు రూ.3 లక్షలను ప్రోత్సాహకంగా మొత్తంగా రూ.9.40 లక్షలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

నేడు జెడ్పీలో 'హైటీ'

కర్నూలు(అర్బన్): క్రిస్మస్ సందర్భంగా గురువారం సాయంత్రం 6 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో క్రైస్తవులకు ' హైటీ ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్ సబీహా పర్వీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా సర్వోన్నతాధికారి డా.జీ సృజన అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో క్రైస్తవ మత పెద్దలు, సంఘ కాపరులు, సంఘస్తులు, యవ్వనస్తులందరూ హాజరు కావాలని కోరారు.

మిర్చి క్వింటా రూ.30 వేలు

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటైన మిర్చి యార్డులో బుధవారం క్వింటా రూ.30 వేలు ధర పలికింది. గత ఆదివారం రూ.28 వేలు ఉండగా.. మూడు రోజులకు రూ.2వేల ధర పెరగడం విశేషం. బుధవారం యార్డుకు మొత్తం 628 సంచుల మిర్చి వచ్చింది. మధ్యస్థ ధర రూ.17,100, కనిష్ట ధర రూ.6,669గా నమోదైంది. కొత్తగా ఏర్పాటైన మిర్చి యార్డులో మంచి ధర రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలూరులో 24న కురవ మహా సింహగర్జన

కర్నూలు(అర్బన్): ఆలూరులో ఈ నెల 24వ తేదీన కురువ మహా సింహ గర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కురువ సంఘం నేతలు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఓటర్లు ఉన్న కురువలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యతను కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బీ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి దేవేంద్ర, నాయకులు తవుడు శ్రీనివాసులు, బీసీ తిరుపాలు, పాల సుంకన్న, పెద్దపాడు బీచుపల్లి, హరిదాసు, పుల్లన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు: మండల పరిధిలోని దిన్నె దేవరపాడు గ్రామానికి చెందిన వివాహిత రాజకుమారి (36) ఇంట్లోని పడక గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే గ్రామానికి చెందిన మేనమామ కుమారుడు రమేష్‌తో ఈమెకు 18 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. వీరికి ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. భర్త రమేష్ గౌండా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా రాజకుమారి కడుపునొప్పితో బాధ పడుతుండేది. మంగళవారం రాత్రి నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గుర్తించి ఉరి నుంచి తప్పించి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. కడుపునొప్పి భరించలేకనే తన కూతురు మృతిచెందినట్లు తల్లి రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించారు.

అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- డీఆర్వో కె.మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమల్లో భాగంగా పునరావాసం, పరిహారాల చెల్లింపులను వేగవంతం చేయాలన్నారు. బాధితులకు న్యాయం చేయడంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని పోలీసులకు సూచించారు. చట్టం అమలులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న డీవీఎంసీ సమావేశాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ డే రోజును కేటాయించి నిర్వహిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ త్రైమాసికానికి సంబంధించి బాధితులకు రూ.1.74 కోట్ల పరిహారం మంజూరైనట్లు చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి మాట్లాడుతూ 14 మంది సఫాయి కార్మికులకు ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. మరికొంతమందికి జీవనాధారం కోసం భూములు ఇచ్చినట్లు చెప్పారు. కొన్ని పాత, కొత్త కేసులు నమోదయ్యాయని, వాటిన్నింటిపై విచారణ చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సర్కార్, దిశా డీఎస్పీ సుధాకరరెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం

కర్నూలు(హాస్పిటల్): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత అన్నారు. నగర శివారులోని పంచలింగాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఎవ్వరూ కూడా రక్తహీనతతో బాధపడకుండా ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యమన్నారు. ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని, విటమిన్-సి ఉన్న నారింజ, బత్తాయి, నిమ్మకాయలు వంటివి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాజినీస్, షబ్బీర్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాన్ని అమలు చేయాలి

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వం 1976లో ఏర్పాటు చేసిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. జాతీయ ఫెడరేషన్ పిలుపు మేరకు బుధవారం ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలులో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బసవరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుతి, శేషాద్రి,నాయకులు ప్రసాదశర్మ, ఎ. వెంకట్, జిల్లా కార్యదర్శి సభ్యులు ఖలీల్, షేక్షావలి, మారుతి, రాఘవేంద్ర, శివరంగ, సురేంద్ర పాల్గొన్నారు.